క్లుప్తంగా

లక్ష్మీదేవమ్మ సేవలు చిరస్మరణీయం



లక్ష్మీదేవమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: మాజీ మంత్రి, దివంగత లక్ష్మీదేవమ్మ సేవలు చిరస్మరణీయమని ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. మాజీ మంత్రి లక్ష్మీదేవమ్మ 14వ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక జూనియర్ కళాశాల రోడ్డులో ఉన్న ఆమె విగ్రహానికి ఎంపీ పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కళ్యాణదుర్గం ప్రాంతంలో లక్ష్మీదేవమ్మ ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పేదల కోసం పోరాటం చేస్తూ అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, లక్ష్మీదేవమ్మ కోడలు చందనాశివాజీ, కుటుంబ సభ్యులు విజయ్‌కుమార్, కౌన్సిలర్ పరమేశ్వరప్ప, నాయకులు దొణస్వామి, గొల్ల సూరి, కాంతమ్మ, నారాయణస్వామి, మల్లి, ఇబ్రహీం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంబదూరులో లక్ష్మీదేవమ్మ వర్ధంతి



లక్ష్మీదేవమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న చందనశివాజీ

కంబదూరు: మండల కేంద్రంలో మాజీ మంత్రి, దివంగత లక్ష్మీదేవమ్మ వర్ధంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం నిర్వహించారు. స్థానిక చెక్‌పోస్టు వద్ద ఉన్న మాజీ మంత్రి లక్ష్మీదేవమ్మ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు చందన శివాజీ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లింగమూర్తి, శివప్రసాద్, మల్లికార్జున, ప్రజా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాంతి, యానిమేటర్ మారుతి, అశోక్, అర్చకుడు మల్లికార్జున, రాంబాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'పది' ప్రజ్ఞ వికాస పరీక్షకు స్పందన



పది మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాయదుర్గంటౌన్: పదో తరగతి విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టి పరీక్షలకు సన్నద్ధం చేసేలా ఎస్‌ఎఫ్‌ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన టిస్ ప్రజ్ఞ వికాస మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. పట్టణంలోని సెయింట్ పాల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో పదో తరగతి ప్రజ్ఞ వికాస పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. యూటీఎఫ్ నాయకులు వెంకటరామిరెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజాహుస్సేన్ హాజరై మాట్లాడారు. పరీక్షల కోసం టిస్ విద్యార్థులను ముందస్తుగా సిద్ధం చేసేలా వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు ఇలాంటి ప్రతిభ పరీక్షలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు గౌతమ్, పట్టణ ఉపాధ్యక్షుడు వీరేష్, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రేపు 'వైఎస్సార్ ఆసరా' సభ

కణేకల్లు: మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 11 గంటలకు 'వైఎస్సార్ ఆసరా' సభ ఉంటుందని వైకేఈ ఏపీఎం గోవిందప్ప ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బస్టాండ్ ప్రాంతంలో నిర్వహించనున్న సమావేశానికి ఏపీఐఐసీ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హాజరవుతారన్నారు.

తాగినీటి సమస్య తీర్చిన ఎంపీ



ఎర్రబోరెపల్లిలో మోటార్, పైపులను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

శెట్టూరు: మండలంలోని ఎర్రబోరెపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్య అనంతపురం ఎంపీ తలారి రంగయ్య తీర్చారు. గ్రామంలో తాగునీటి కొరత ఉండడంతో గ్రామస్తులు ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త రంగయ్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నిధులను కేటాయించి, సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి బోరు బావి తవ్వగా నీరు సమృద్ధిగా పడింది. వెంటనే మోటార్, పైపులు ఏర్పాటు చేసి, నీటిని సరఫరా చేయించారు.

ఇదిగో స్థిరాస్తి

అక్క,చెల్లెమ్మలకు 'పట్టా'భిషేకం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి పథకమూ అక్కచెల్లెమ్మల పేరిట ప్రారంభిస్తున్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలులోకి తెచ్చిన నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పేదోడి సొంతింటి కల సాకారం చేశారు. పైసా ఖర్చు లేకుండా ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇచ్చి, ఇంటిపై సర్వహక్కులు కల్పించేందుకు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. దీంతో రూ.లక్షలు విలువజేసే స్థిరాస్తి అక్కచెల్లెమ్మల సొంతమవుతోంది.

- శరవేగంగా జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు
- ఇప్పటికే 4,025కుపైగా పూర్తి
- రూ.లక్షలు విలువజేసే ఆస్తి సొంతం
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు



రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 16,061 మందికి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. వీరందరికీ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందివ్వనుంది. మూడు నియోజకవర్గాల్లో ఇప్పటికే 4,025 మంది రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. మిగిలినవి కూడా ఈ నెల 15 లోపు పూర్తిచేసేలా అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు.

పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు..

రిజిస్ట్రేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకాధికారుల నియామకానికి ఉత్తర్వులు జారీ చేశారు. డీఎల్‌డీఓతో పాటు మున్సిపాలిటీల్లో కమిషనర్లు, మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు ప్రత్యేకాధికారులుగా నియమించారు. వారు ఎప్పటికప్పుడు సచివాలయాల్లో తనిఖీలు చేపట్టి సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్నారు. పట్టా మంజూరు సమయాన ఏవైనా పొరపాట్లు దొర్లి ఉంటే వాటిని సరిదిద్దుతున్నారు.

లబ్ధిదారుల వివరాలు ఇలా..		
నియోజకవర్గం	ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు	పూర్తిచేసిన రిజిస్ట్రేషన్లు
రాయదుర్గం	6,635	1,810
కళ్యాణదుర్గం	3,464	952
ఉరవకొండ	5,962	1,263



పూలకుంట లో రిజిస్ట్రేషన్ పత్రం అందుకుంటున్న లబ్ధిదారురాలు వడ్డే మంజమ్మ



75 వీరాపురంలో రిజిస్ట్రేషన్ పత్రం అందుకుంటున్న లబ్ధిదారురాలు బోయ అపర్ణ

ఆనందంగా ఉంది

ఇల్లులేని నాకు పట్టా ఇవ్వడమే కాదు.. దాన్ని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఇది పేదలకు గొప్ప ఆస్తిగా మిగలనుంది. భవిష్యత్తులో జగనన్న కాలనీల్లో స్థలాలు, ఇళ్లంటేనే మంచి డిమాండ్ ఉంటుంది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– బోయ అపర్ణ, 75 వీరాపురం, లబ్ధిదారురాలు

అద్దె కష్టాలు తప్పాయి



ఇల్లులేక అద్దెలు చెల్లించుకోలేక నరకయాతన అనుభవించాం. గత టీడీపీ హయంలో ఇంటికోసం దరఖాస్తు చేసినా పట్టించుకోలేదు. అడక్కపోయినా వలంటీరే వచ్చి రాయదుర్గం గౌడ లేఔట్‌లో స్థలం ఇప్పించి ఇల్లు మంజూరయ్యేలా కృషి చేశారు. నీడ నిచ్చిన జగనన్నను ఆజన్మాంతం మరచిపోలేను.

– శారద, లబ్ధిదారురాలు, రాయదుర్గం

రిజిస్ట్రేషన్‌కు సహకరిస్తున్నాం

పేదల ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌కు సహకారం అందిస్తున్నాం. గ్రామ/వార్డు సచివాలయాల్లో ఈ ప్రక్రియ వేగవంతంగా కొనసాగించేలా కృషి చేస్తున్నాం. కొన్ని సచివాలయాల వద్దకు నేరుగా వెళ్లి అవసరమైన సలహా, సూచనలు అందిస్తున్నాం. విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేలా కృషి చేస్తున్నాం.

– శ్రీనివాసులు, సబ్‌రిజిస్ట్రార్, రాయదుర్గం

పేదలకు గొప్ప స్థిరాస్తి



జగనన్న కాలనీలు కాదు ఊళ్లను తలపిస్తున్నాయి. ఇంటి స్థలానికి సర్వహక్కు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉచితంగా చేసే రిజిస్ట్రేషన్లు ఈ నెల 15 లోపు పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నాం.

– శంఖర్, డీఎల్‌డీఓ, కళ్యాణదుర్గం

జర్నలిజానికే వన్నె తెచ్చిన వ్యక్తి తిమ్మారెడ్డి



తిమ్మారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ తదితరులు

ఉరవకొండ: విలువలతో కూడిన జర్నలిజంతో ఆ రంగానికే వన్నె తెచ్చిన వ్యక్తి రాకెట్ల వై.తిమ్మారెడ్డి అని పలువురు జర్నలిస్టులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తిమ్మారెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులు షేక్షావలి, ఆజాద్ మాట్లాడుతూ తిమ్మారెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తిమ్మారెడ్డి చిత్రపటం వద్ద మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు దాసెట్టి రామాంజనేయులు, కె.ఆనంద్‌రావు, తిమ్మారెడ్డి సోదరులు వై.శ్రీనాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాకెట్ల అశోక్, తేజోనాథ్, ఎంపీపీ నరసింహులు, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి తదితరులు తిమ్మారెడ్డి చేసిన పోరాటాలను గుర్తుచేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాకెట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలిసిన 2003-04 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003–04 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. ఒకరినొకరు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం చదువులు చెప్పిన గురువులకు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల్లో ఎక్కువగా రాకెట్ల, కొకుంట్ల గ్రామాలకు చెందిన వారు ఉన్నారు.

నేటి నుంచి మాజీ ఎమ్మెల్యే విశ్వ ఎన్నికల ప్రచారం



కూడేరులో మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణ రెడ్డి

కూడేరు: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీతో గెలవడం తథ్యమని, నేటి నుంచి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి పి.నాగిరెడ్డి పల్లిలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణలు హాజరవుతారన్నారు. ముందుగా రూ.6.40 కోట్లతో మరుట్లకు నిర్మించే తారు రోడ్డు నిర్మాణపు పనులకు కూడేరులో ఉదయం 8.30 గంటలకు భూమి పూజ చేస్తారన్నారు. కార్యక్రమానికి సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సభ్యులు, పార్టీ నేతలు, అనుబంధ సంఘాల నేతలు అందరూ పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, సింగిల్‌విండో అధ్యక్షుడు గంగాధర్, మండల కోఆప్షన్ సభ్యుడు సర్దార్ వలి, పార్టీ మండల నేతలు శివరావు, రామచంద్ర, రామాంజనేయులు, ఎర్రనాగప్ప, ఎర్రిస్వామి, వన్నూరప్ప, హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినం





ప్రత్యేక అలంకరణలో వాసవీమాత, శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలో పాల్గొన్న మహిళలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి కళశాలతో ఆలయం వద్ద వినాయక సర్కిల్ వరకు ఊరేగించారు. ఆలయంలో మహా గణపతి హోమం, నవగ్రహ, వాసవీ హోమాలు జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వాసవీమాత ఆత్మార్పణ సందర్భంగా కన్యకాపరమేశ్వరి దేవికి ప్రత్యేక పూల అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.

ప్రజల సంక్షేమమే జగనన్న ధ్యేయం



ఇంటింటా ప్రచారం చేస్తున్న మెట్టు విశ్వనాథ్ రెడ్డి

రాయదుర్గం రూరల్: ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని ఏపీఐఐసీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రాయంపల్లి గ్రామంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జెడ్పీటీసీ మల్లికార్జున, గ్రామ సర్పంచ్ గొల్ల చంద్రకళ, రాయంపల్లి రామాంజినేయులు, బోర్వెల్ నాగిరెడ్డితో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా ప్రతి పథకాన్నీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మి, ఉడేగోళం సొసైటీ అధ్యక్షుడు భీమన్న, కోఆప్షన్ సభ్యులు దిలావర్ బాషా, రాయంపల్లి నగేష్ , అంజి, బీఎస్ హళ్లి స్టోర్ డీలర్ తిప్పేస్వామి, అయ్యప్ప, మలకాపురం గోపాల్ , జుంజురాంపల్లి మఠం నగేష్ , మఠం రుద్రముని, కొండాపురం రామన్న , గుడి చంద్ర, హనుమంతరాయుడు, కురుబ రుద్ర, గొల్ల మంజునాథ, వై.మహేంద్ర, చిత్తయ్య, కరిబసవ, హెచ్. తిప్పేరుద్ర, రుద్ర, గోపాల్, దొడ్డయ్య, మెచ్చిరి చంద్ర, మల్లాపురం చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా ఎన్నికలకు సిద్ధం కండి

- వైఎస్సార్‌సీపీ ఉరవకొండ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో విశ్వేశ్వరరెడ్డి విస్తృతంగా పర్యటించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్న పులికొండ స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. పార్టీలు , కుల, మతాలకతీతంగా పాలన సాగింద న్నారు. ఇటీవల ఉరవకొండలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సభలో నియోజకవర్గ అభివృద్ధి విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే ఆయన స్పందించి రూ.218 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉరవకొండ ప్రాంతంలో హంద్రీనీవా ఉపకాలువల నిర్మాణంతోపాటు ఉరవకొండ-గుంతకల్లు నియోజకర్గాల పరిధిలో ఉప కాలువ ద్వారా చెరువులకు నీరు అందించడానికి నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఎన్నికలప్పుడే పయ్యావులకు ప్రజలు గుర్తుకొస్తారు..

సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడినప్పుడు మాత్రమే నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు గుర్తుకు వస్తారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. నాలుగున్నరేళ్లుగా ప్రజలకు కనిపించకుండా కేవలం ఎన్నికలకు రెండు నెలల సమయం ఉండగా ప్రజలకు వద్దకు వస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా ఏరోజూ ప్రజా సమస్యలు పట్టించుకున్న పాపానపోలేదన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈనెల 18న జరగనున్న సిద్ధం సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం కార్యదర్శి వెంకటరెడ్డి, సీనియర్ నాయకుడు చిన్నపులికొండ, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్, వజ్రకరూరు సర్పంచు మోనాలిసా, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవికాంతరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాకెట్లబాబు, డైరెక్టర్ బలరాము డు, నాయకులు వీరభద్రగౌడ్, తిప్పారెడ్డి, వెంకటేష్‌నాయక్, కొనకొండ్ల సంజప్ప, బెస్త ఆది తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరులో విశ్వ పర్యటన

వజ్రకరూరు: మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వర రెడ్డి ఆదివారం విస్తృతంగా పర్యటించారు. వజ్రకరూరులోని బలిజవీధిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రఘుపతి నూతన గృహ ప్రవేశానికి విశ్వే శ్వరరెడ్డి హాజరయ్యారు. అనంతరం విశ్వేశ్వరరెడ్డిని రఘుపతి, కుటుంబ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం కార్యదర్శి వెంకటరెడ్డి, వజ్రకరూరు సర్పంచు మోనాలిసా, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవికాంతరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాకెట్ల బాబు, పీఏసీఎస్ డైరెక్టర్ బలరాముడు, బీసీ సెల్ కార్యదర్శి వీరభద్రగౌడ్, పార్టీ నాయకులు తిప్పారెడ్డి, వెంకటేష్‌నాయక్, కిష్టన్న, బెస్త ఆది, కొనకొండ్ల సంజప్ప, రంగ నాథ్ యాదవ్ పాల్గొన్నారు.

ఎన్నికల సమరానికి సిద్ధం

- నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్న విశ్వ
- నేడు కూడేరు మండలం నాగిరెడ్డిపల్లి నుంచి ప్రారంభం

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఎన్నికల సమరానికి సమర శంఖం పూరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి, పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టిన విశ్వేశ్వరరెడ్డి.. వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సోమవారం కూడేరు మండలం నాగిరెడ్డిపల్లి నుంచి ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారు.

ప్రచార రథం సిద్ధం: ఎన్నికల ప్రచారానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రత్యేకంగా ప్రచార రథం తయారు చేయించారు. ఈవాహనంపై నుంచి విశ్వేశ్వరరెడ్డి ప్రసంగించనున్నారు. కూడేరు మండలం నాగిరెడ్డిపల్లిలో ప్రచారం ప్రారంభించనున్నారు. దాదాపు 50 రోజుల పాటు సాగే ఈయాత్రలో ప్రతి గ్రామం మీ దుగా ప్రచారం సాగేలా రూట్‌మ్యాప్ తయారు చేశారు.

గెలుపే లక్ష్యంగా ప్రచారం..

ఉరవకొండ నియోజకవర్గంలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.1,307 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.2,285.163 కోట్లతో సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేశాం. వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేపట్టనున్నాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల ముంగిటకే సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా సేవలు అందిస్తున్నాం. రైతుల కోసం ఆర్‌బీకే సేవలు అందిస్తున్నాం. ఎక్కడా అవినీతి, అక్రమాలకు తావు లేకుండా, అర్హతే ప్రామాణికంగా పాదర్శకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతాం.

– వై.విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త, ఉరవకొండ



ఎన్నికల ప్రచారానికి సిద్ధమయిన ప్రచార రథం

ప్రశాంత జీవనం సాగించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

కణేకల్లు: గొడవలు లేకుండా ప్రశాంత జీవనం సాగించాలని రాయదుర్గం రూరల్ సీఐ జే ప్రసాద్ బాబు పేర్కొన్నారు. ఆదివారం పెనకలపాడులో సీఐ ఆధ్వర్యంలో కణేకల్లు, బొమ్మనహాళ్ ఎస్ఐలు శ్రీనివాసులు, వి.శ్రీనివాసులుతోపాటు సిబ్బంది కార్డెన్ సెర్చ్‌లో నిర్వహించారు. పలువురి ఇళ్లు, కళ్లాల్లో సోదాలు చేశారు. అనంతరం ప్రజలతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పంతాలు, పట్టింపులకెళ్లి చిన్న విషయాలకు గొడవలు చేస్తే సహించేది లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించబోమని అన్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

సంక్షిప్త సమాచారం

108 వాహనంలో ప్రసవం



ప్రసవం చేసిన ఈఎన్‌టీ రామతులసి

రాయదుర్గం: గుమ్మఘట్ట మండలం గొల్లపల్లికి చెందిన దుర్గ అనే గర్భిణి శుక్రవారం రాత్రి పురిటినొప్పులతో రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో చేరింది. గర్భిణికి హైరిస్క్ ఉండడంతో సిబ్బంది కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. 108 వాహనంలో అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గంమధ్యలో కాలువపల్లి వద్దకు చేరుకోగానే భరించలేని నొప్పులు వచ్చాయి. 108 వాహన ఈఎన్‌టీ రామతులసి, పైలెట్ ఉమేష్ సహకారంతో సుఖప్రసవమైంది. ఐదేళ్ల తర్వాత జన్మించిన బిడ్డను చూసి దుర్గ కుటుంబ సభ్యులు మురిసిపోయారు. సుఖ ప్రసవం చేసిన ఈఎన్‌టీ రామతులసికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా కరెప్పస్వామి విగ్రహ ప్రతిష్ట

రాయదుర్గం రూరల్: మండలంలోని వేపరాలలో కరెప్పస్వామి విగ్రహ ప్రతిష్ట ఆదివారం జరిగింది. ఉదయం 5 గంటలకు వేదవతి నదిలో గంగపూజ చేశారు. అనంతరం గ్రామంలో కరెప్పస్వామితో పాటు గూళ్యం కరిలింగేశ్వరస్వామి, బాగీరప్ప స్వామి, డోణి కల్లప్ప స్వామి, నందవారప్ప స్వామి విగ్రహాలను ఊరేగించారు. కుష్మాండ బలిపూజ, పూర్ణాహుతి హోమం, మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం ఆడపడుచులకు ఒడిబియ్యం వేశారు.

మూడు మోకాళ్లమ్మ అమ్మవారి ఊరేగింపు

బొమ్మనహాళ్: మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లోని మూడు మోకాళ్లమ్మ అమ్మవారి ఊరేగింపు ఆదివారం ఉదయం వైభవంగా జరిగింది. అంబేడ్కర్ కాలనీలో దళితులు మూడు మోకాళ్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. గంగాజలం తెచ్చి అభిషేకాలు జరిపించారు. మంగళవారం ఉదయం అమ్మవారిని ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

13న జగనన్న ఆరోగ్య సురక్ష

కూడేరు: మండలంలోని చోళసముద్రంలో ఈ నెల 13న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చోళసముద్రం, జయపురం గ్రామాలకు చెందిన ప్రజలు ఈ శిబిరం ద్వారా అందించే ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన కర్ణాటక మద్యంతో ఎస్ఐ ఆంజనేయులు

కంబదూరు: కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న మహిళను పట్టుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఆదివారం కురాకులపల్లిలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందని, మద్యం విక్రయిస్తున్న గొల్ల లక్ష్మీదేవమ్మ నుంచి 35 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.